విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలించిన కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభా ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయ భద్రతా సిబ్బంది, ఇతర పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించినట్టు మంత్రి తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి తీరు హాస్యాస్పదం

బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ ధ్వజం

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): సెక్రటేరియట్ వద్ద ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రానివారిని మంత్రి కోమటిరెడ్డి తెలంగాణ వ్యతిరేకుల నడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ నేత, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ఆక్షేపించారు. అసలు అక్కడ ఏర్పాటు చేస్తున్న విగ్రహం తెలంగాణ తల్లి కాదని, కాంగ్రెస్ తల్లి అని ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అనేక మంది ఉద్యమకారుల మరణానికి కారణమైన కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ తల్లి గురించి మాట్లాడే నైతిక హక్కే లేదని విమర్శించారు. తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను తీసేసి తెలంగాణ సంస్కృతిని అవమానించారని మండిపడ్డారు.

విద్యారంగం అభివృద్ధికి ఎస్టీయూటీఎస్ కృషి

సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): విద్యారంగం అభివృద్ధికి ఎస్టీయూటీఎస్ కృషి చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం 78వ వార్షిక కౌన్సిల్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో నైతిక విలువల పెంపునకు కృషి చేస్తూ రేపటి తరాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని సూచించారు. సంస్థ సలహాలు, సూచనలను ప్రభుత్వానికి అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ సీపీఎస్ అభ్యర్థిగా ఇన్నారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీపీఎస్ అభ్యర్థిగా తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి పేరును యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రకటించారు. మార్చిలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి ఆదివారం యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. పెట్టుబడిదారి పెన్షన్ విధానాన్ని పారదోలేందుకు ఎన్నికల్లో తమ అభ్యర్థిని బరిలోకి దింపినట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్, పోల శ్రీనివాస్, సభ్యులు మల్లి కార్జున్, రాజేశ్, వనమాల, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో సాంకేతిక లోపం

కమలాపూర్, డిసెంబర్ 8 : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో వందేభారత్, రాజధానితోపాటు పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు ఆదివారం అంతరాయం కలిగింది. దక్షిణ, ఉత్తర భారతాన్ని కలిపే కాజీపేట-బల్లార్షా ప్రధాన రైలుమార్గం కావడం.. ఉదయం 9.30 గంటలకు సాంకేతిక సమస్య తలెత్తడంతో సిగ్నల్స్ పడిపోయాయి. 14వ రైల్వేగేట్ ఇంటర్ లాక్ కావడంతో గేటు తెరుచుకోలేదు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సిగ్నల్స్ పడిపోవడంతో 15 నంబర్ రైల్వేగేట్ సమీపంలో సుమారు 20 నిమిషాలపాటు ఆగిపోయింది. అప్రమత్తమైన రైల్వే అధికారులు కాషన్ ఆర్డర్ ఇచ్చి స్టేషన్ దాటించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ కూడా 30 నిమిషాలపాటు నిలిచిపోయింది.

మేం రాలేం.. మీరే కానివ్వండి

- కాంగ్రెస్ ఏడాది పాలన ఉత్సవాలకు ఢిల్లీ పెద్దలు దూరం
- వేడుకలకు కాంగ్రెస్ అగ్ర నేతలను పిలిచిన రాష్ట్ర నేతలు
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సోనియాకు ఆహ్వానం
- విగ్రహ రూపురేఖల మార్పుపై అధిష్ఠానం పెద్దల అసంతృప్తి!
- రాష్ట్రానికి రాలేమని తేల్చిన సోనియా, రాహుల్, ప్రియాంక!

సచివాలయం ఆవరణలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న తెలంగాణ తల్లి నూతన విగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రజాపాలన విజయోత్సవాలు" పేరుతో వేడుకలు నిర్వహిస్తున్నది. ఏడాది పాలనలో అద్భుత ప్రగతి సాధించామంటూ గొప్పలు చెప్పుకుంటున్నది. ఉత్సవాలకు ఢిల్లీ పెద్దలను అతిథులుగా పిలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ముగింపు వేడుకకు అగ్రనేత సోనియా గాంధీ వస్తారని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆమే ఆవిష్కరిస్తారని చెప్పారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్భాటంగా నిర్వహించిన ఉత్సవాల వ్యవహారమంతా బెడిసికొట్టినట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఉత్సవాలకు అధిష్ఠానం పెద్దలెవరూ రావడంలేదని తెలుస్తున్నది. తాము ఉత్సవాలకు హాజరుకాబోమని సోనియా, రాహుల్, ప్రియాంక స్పష్టంచేశారని సమాచారం. ఆహ్వానం అందించేందుకు కూడా ఢిల్లీకి రావొద్దని తేల్చిచెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. పిలిచినా రాలేదనే అపవాదు ఎందుకులే అని, అందుకే రాష్ట్రనేతలు ఢిల్లీ పెద్దలకు ఆహ్వానం కూడా అందించలేదని కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందుకేనా దూరం.. దూరం

ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కొంతకాలం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు ఢిల్లీకి వెళ్లినప్పుడు అధిష్ఠానం పెద్దల అపాయింట్‌మెంట్ ఉండేది. కానీ కొన్ని నెలలుగా పరిస్థితి పూర్తిగా మారిపోయినట్టు కాంగ్రెస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇతర రాష్ట్రాల ఎన్నికలపై జరిగే సమీక్షలోనో, పార్లమెంట్‌లోనో, ఏదైనా వేడుకలోనో అగ్రనేతలను కలుసుకోవడం తప్ప... ప్రత్యేకంగా రేవంత్‌రెడ్డి అధిష్ఠానం పెద్దలను కలుసుకోక చాలాకాలమైంది. ఎందుకంటే.. రాష్ట్రంలో పాలనపై రాహుల్, ప్రియాంక తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఆరు గ్యారెంటీల అమలు, హామీ మేరకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందనే అభిప్రాయంతో అగ్రనేతలు ఉన్నట్టు సమాచారం. పథకాల్లో కోతల వల్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన సంగతి కూడా అధిష్ఠానానికి నివేదికల రూపంలో అందిందని కాంగ్రెస్‌లోని సీనియర్‌నేతలే చెబుతున్నారు. తెలంగాణలో మాట తప్పడంతో మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రజలు నమ్మలేదని, అక్కడ ఓటమికి రేవంత్‌రెడ్డి పాలన కూడా ఓ కారణమైందనే అభిప్రాయంతో అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం. ఏడాదిలోనే ప్రజావ్యతిరేకత మూటగట్టుకుని విజయోత్సవాలు జరపడమేంటని గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో వేడుకలకు హాజరయ్యే ప్రసక్తే లేదన్నట్టు సమాచారం.

విగ్రహ మార్పుతో అగ్ని ఆజ్యం పోస్తారా?

రేవంత్‌రెడ్డి పాలన తీరుపై అసంతృప్తితో ఉన్న అధిష్ఠానం ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై మరింత ఆగ్రహం వ్యక్తంచేసినట్టుగా తెలిసింది. సర్కారు నిర్ణయం, ప్రజల స్పందనపై ఆరా తీసిన కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డట్టు సమాచారం. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ తెలంగాణ ప్రజలకు సుపరిచితంగా ఉన్న విగ్రహంలో మార్పులు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రజలకు మేలు చేసే పనులపై దృష్టిపెట్టకుండా విగ్రహాల మార్పుపై ఫోకస్ చేయడంపై రేవంత్‌రెడ్డికి క్లాస్ పీకినట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. ప్రజావ్యతిరేకత నేపథ్యంలో అగ్నికి ఆజ్యం పోసినట్టు అనాలోచిత నిర్ణయాలేంటని నిలదీసినట్టు తెలుస్తున్నది. ఉత్సవాలకు మేం రాలేం.. మీరే కానివ్వండి అని తేల్చిచెప్పినట్టు సమాచారం.



నస్పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్‌లో బీఆర్ఎస్ నిరసన

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 8 : కాంగ్రెస్ సర్కారు తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. ఈ మేరకు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. అనంతరం దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

భారతీయులకు దుబాయ్ వీసా కష్టాలు

న్యూఢిల్లీ: దుబాయ్‌లో పర్యటించాలనుకునే భారతీయులకు కొత్త కష్టాలు వచ్చాయి. ఈ నెల 8 నుంచి 14 వరకు జరిగే దుబాయ్ షాపింగ్ ఫెస్టివల్‌కు వెళ్లాలని చాలా మంది భారతీయులు ఉత్సాహంగా ఉన్నారు. కానీ దుబాయ్ ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ అమలు చేస్తున్న కొత్త వీసా నిబంధనలు వీరిని నిరుత్సాహపరుస్తున్నాయి. టూరిస్ట్ వీసా కావాలంటే, పర్యాటకులు దుబాయ్ నుంచి తిరిగి వెళ్లడానికి కన్‌ఫర్మ్‌డ్ రిటర్న్ ఫ్లైట్ టికెట్ల కాపీని తప్పనిసరిగా సమర్పించాలని నిబంధనలు చెప్తున్నాయి. అక్కడ బస చేసే హోటల్ అకామిడేషన్ కన్ఫర్మేషన్, ఇతర వివరాలు, ఖర్చులకు తగినంత సొమ్ము నిరూపించే బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు లేదా లేఖ సమర్పించాలని చెప్తున్నాయి.

ప్రారంభోత్సవాలు చేస్తూ బిల్లులు ఇవ్వరా?

- అసెంబ్లీ సమావేశాల్లోనే స్పష్టత ఇవ్వండి
- 27న అమరవీరుల స్థూపం వద్ద ఆమరణ దీక్ష చేస్తాం
- అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశాం
- తాజా మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు కరుణాకర్

సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

ఖైరతాబాద్, డిసెంబర్ 8 : తాము అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే, వాటిని గొప్పగా చెప్పుకొని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తమకు మాత్రం బిల్లులు ఇవ్వటం లేదని తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి కరుణాకర్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏడాదికాలంగా సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించటం లేదని పేర్కొన్నారు. రిలే దీక్షలు, శాంతియుత నిరసన చేపట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు తామెందుకు చెల్లించాలని ఓ మంత్రి అంటున్నాడని వాపోయారు. అవే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేస్తూ, బిల్లులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన కాంట్రాక్ట్ పనులకు రూ.5 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచులు కావడంతోనే వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లోనే పెండింగ్ బిల్లుల విడుదల విషయంలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పల్లెబాట చేపట్టి కాంగ్రెస్ అబద్ధపు హామీలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. ఈ నెల 27న అమరవీరుల స్థూపం వద్ద ఆమరణ దీక్ష చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ సర్పంచులు కే గంగాధర్, లింగ ఎల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, చెన్నమనేని స్వయం ప్రభ, గున్నాల లక్ష్మణ్, కెంద గంగాధర్, రంగు రాములు, మల్యాల దేవయ్య, ఆరె మహేందర్, రాసూరి రాజేశ్, కాదస్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయిల్‌ఫెడ్ సరుకులు బంద్

II పేజీ తరువాయి...

'చేయూత' ఇస్తామని సదరు సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. దీంతో ఆయిల్‌ఫెడ్‌కు ఎగనామం పెట్టి సంస్థ ఆదాయానికి గండి కొట్టి ప్రైవేటు సంస్థకు పచ్చజెండా ఊపినట్టుగా తెలిసింది.

ప్రభుత్వ సంస్థకు ఎగనామం

ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ కొన్నేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు రకాల సరుకుల కిట్‌ను సరఫరా చేస్తున్నది. 'విజయ' బ్రాండ్ పేరుతో నాణ్యమైన సరుకులతో ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రక్రియ సాగుతున్నది. ఇక విజయ ఆయిల్‌ను గడిచిన 20 ఏళ్లుగా సరఫరా చేస్తుండడం గమనార్హం. అంగన్‌వాడీలకు విజయ ఆయిల్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో) కూడా జారీ అయ్యాయి. సరుకుల సరఫరా ద్వారా సంస్థకు కొంత ఆదాయం సమకూరుతున్నది. ఇప్పుడు ఈ ఆదాయానికి గండికొట్టే కుట్రలు జరుగుతుండడం గమనార్హం. ప్రభుత్వ సంస్థకు వచ్చే ఆదాయాన్ని ప్రైవేటు జేబులోకి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలిసింది. ఇందులో భాగంగానే ఈ ఆదాయంపై ఓ కాంగ్రెస్ కార్యకర్త కన్ను పడినట్లుగా తెలిసింది. అంతే సదరు వ్యక్తి ఓ మంత్రి అండతో సరుకుల సరఫరాను దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించి మంత్రికి అవాస్తవాలను నూరిపోసినట్లుగా తెలిసింది. ముఖ్యంగా మంత్రిని ఒప్పించేందుకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న సరుకుల నాణ్యతపై తప్పుడు సమాచారం ఇచ్చినట్టుగా తెలిసింది. సరుకుల నాణ్యత సరిగ్గా లేదని, అందుకే తమకు ఇస్తే మంచి సరుకులు సరఫరా చేస్తామని నమ్మబలికినట్లు తెలిసింది. దీంతో పాటు 'సహకారం' అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తొలి దశలో సదరు కాంగ్రెస్ కార్యకర్తకు కొంత మేర సరఫరా బాధ్యతను అప్పగించేందుకు అంగీకరించినట్లుగా తెలిసింది. తద్వారా ప్రభుత్వ సంస్థను పూర్తిగా పక్కకు పెట్టారనే విమర్శలు, ఆరోపణలు రాకుండా '50-50' ప్లాన్ వేసినట్లుగా తెలిసింది. ఆ తర్వాత మెల్లిగా పూర్తిగా ఆయిల్‌ఫెడ్‌ను పూర్తిగా పక్కనపెట్టి.. సదరు కార్యకర్త సంస్థకు మొత్తం సరఫరాను కట్టబెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలిసింది.

అంగన్‌వాడీలకు నాణ్యమైన సరుకులు అందేనా?

అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరా బాధ్యతను ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్‌కు కాకుండా ప్రైవేటు సంస్థకు అప్పగించాలనే నిర్ణయం... సరుకుల నాణ్యతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సరుకుల సరఫరాలో ప్రభుత్వరంగ సంస్థకు ఓ బాధ్యత ఉంటుంది. ఏమైనా ఇబ్బందులు ఎదురైనా అడిగే వీలుంటుంది. అదే ప్రైవేటు సంస్థ అంత బాధ్యతగా వ్యవహరిస్తుందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్ ద్వారా సరఫరా చేసే సరుకుల నాణ్యతను పలు దశల్లో పరీక్షించి అన్ని విధాలా సర్టిఫికెట్లను తీసుకున్న తర్వాతే కేంద్రాలకు సరఫరా చేస్తారు. దీంతో సరుకుల నాణ్యతపై సందేహాలు ఉండేవి కావు. కానీ ఇదే ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే.. లాభాపేక్షే ధ్యేయంగా పని చేసే ప్రైవేటు సంస్థ ఆయిల్‌ఫెడ్ స్థాయిలో సరుకుల నాణ్యతను పాటిస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇకపై అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు అందుతాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వ సంస్థను పక్కన పెట్టాల్సిన పనేంటి?

అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాను 50 శాతం ఆయిల్‌ఫెడ్‌కు, మరో 50శాతం ప్రైవేటు సంస్థకు అప్పగించినట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో సరుకుల సరఫరాలో ప్రభుత్వ సంస్థను పక్కనపెట్టి ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థను పక్కనపెట్టి ప్రైవేటు సంస్థకు అది కూడా కాంగ్రెస్ కార్యకర్త సంస్థకు అప్పగించాల్సిన అవసరం ఏంటని ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధంగా తమ అవకాశాలను, వ్యాపారాలను దెబ్బతీయాలనుకోవడం దారుణమని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి అంగన్‌వాడీలకు సరుకుల సరఫరాను గతంలో మాదిరిగానే పూర్తిగా ఆయిల్‌ఫెడ్‌కే ఉండేలా చూడాలని కోరుతున్నారు. లేని పక్షంలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది బర్బాది

నిధుల్లేని విదేశీ విద్యానిధి

ఏడాదిగా నిలిచిన ప్రభుత్వపథకం

- పైచదువుల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు
- రేపూమాపూ అంటూ కాలం వెళ్లదీస్తున్న సర్కారు
- ఆర్థిక భారంతో సతమతమవుతున్న తల్లిదండ్రులు
- బీసీశాఖ పరిధిలోనే 4984 పెండింగ్ దరఖాస్తులు

విద్యార్థులు పేదరికం కారణంగా విదేశీ విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ స్కీమ్ పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని అటకెక్కించింది. దరఖాస్తుల స్వీకరిస్తున్నా లబ్ధిదారులను ఎంపిక చేయడం లేదు. సెప్టెంబర్-డిసెంబర్ మధ్య అడ్మిషన్ల కాలాన్ని ఫాల్ సీజన్ అంటారు. గత ఫాల్ సీజన్ పోయి మళ్లీ ఫాల్ సీజన్ వచ్చినా ప్రభుత్వంలో మాత్రం చలనం రావడం లేదు. ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేయలేదని అధికారులు చెప్తున్నారు. ఇంకా మెరుగైన పథకం తీసుకొస్తామంటూ ప్రభుత్వ పెద్దలు ఆశ చూపుతూ దాటవేస్తున్నారు. ఇదిలా ఉండగానే తాజాగా మళ్లీ ఈ ఫాల్ సీజన్‌కు ప్రభుత్వం అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది.

– హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)

రూపాయి కూడా ఇవ్వని సర్కారు

ఏటా దాదాపు బీసీ బిడ్డలు విదేశాల్లో మాస్టర్స్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదువుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా జనవరిలో (స్ప్రింగ్ సీజన్) 150 మందిని, ఆగస్టులో (ఫాల్ సీజన్) 150 మంది బీసీ విద్యార్థులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేసింది. వీసా చార్జీలు, ప్రయాణ ఖర్చులకు రూ.50వేలు ఇచ్చింది. మొత్తం సీట్లలో 30 సీట్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈబీసీ) విద్యార్థులకు కేటాయించింది. బీసీ ఓవర్సీస్ పథకం కింద 2023 ఫాల్ సీజన్‌కు దరఖాస్తులను స్వీకరించగా, దాదాపు 2665 మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జనవరిలోనే పూర్తయింది. కానీ ప్రభుత్వం అర్హుల జాబితా ప్రకటించలేదు. మళ్లీ స్ప్రింగ్ సీజన్ కోసం ఫిబ్రవరి, మార్చిలో బీసీ సంక్షేమ శాఖ దరఖాస్తులను స్వీకరించింది. మొత్తంగా 1119దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులందరికీ గత నెలలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించినా అర్హుల జాబితాను ప్రకటించలేదు. ఒక్క రూపాయి కూడా కాంగ్రెస్ సర్కారు ఇవ్వలేదు. ఇప్పటికే 3784 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, మళ్లీ ఫాల్ సీజన్ కోసం బీసీ సంక్షేమ శాఖ దరఖాస్తులను స్వీకరించగా, 1200కు పైగా అప్లికేషన్లు వచ్చినట్లు తెలిసింది. ఇవికాకుండా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే సీఎం ఓవర్సీస్, బ్రాహ్మణ విద్యార్థులకు ఇచ్చిన వివేకానంద ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

సర్కారు చెలగాటం.. తల్లిదండ్రుల సంకటం

బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విషయంలో మార్గదర్శకాల పేరిట సర్కారు చెలగాటమాడుతుంటే తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక సంకటంలో కూరుకుపోతున్నారు. తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం మార్గదర్శకాలను మార్చుతామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే గొప్ప తీసుకొస్తామంటూ అసలు పథకాన్నే ఏడాదిగా పక్కనపెట్టింది. ప్రభుత్వ స్కాలర్‌షిప్ వస్తుందనే నమ్మకంతో కొందరు అప్పులు చేసి విదేశాల్లో చదువుకునేందుకు వెళ్లారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఏటా అమలు చేసిన విధానం

సీజన్	ఎంపికైన విద్యార్థులు	అందజేసిన మొత్తం	ప్రయాణ ఖర్చులు
జనవరి (స్ప్రింగ్ సీజన్)	150	రూ. 20లక్షలు	రూ. 50వేలు
ఆగస్టు(ఫాల్ సీజన్)	150	రూ. 20లక్షలు	రూ. 50వేలు

ప్రస్తుత వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

2023(ఫాల్‌సీజన్)	2024(స్ప్రింగ్‌సీజన్)	2024(ఫాల్ సీజన్)
2665	1119	1200

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్ల దుర్మరణం

గజ్వేల్, డిసెంబర్ 8: రాత్రి పెట్రోలింగ్ విధులు ముగించుకొని హాఫ్ మారథాన్‌లో పాల్గొనేందుకు వెళ్తుండగా ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం గాడిచెర్లపల్లికి చెందిన పూసల వెంకటేశ్ (38) దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో, చిన్నకోడూర్ మండలం పెద్దకోడూరుకు చెందిన వర్రోలు పరంధాములు (46) రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరూ హైదరాబాద్ ఈసీఐఎల్‌లో నిర్వహించే హాఫ్ మారథాన్‌లో పాల్గొనేందుకు బైక్‌పై ఆదివారం తెల్లవారుజామున బయలుదేరారు. గజ్వేల్ జాలిగామ బైపాస్‌రోడ్డులో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కానిస్టేబుళ్ల మృతికి మాజీ మంత్రి హరీశ్‌రావు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనూరాధ సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని హరీశ్ భరోసా ఇచ్చారు.

మంచు ఫ్యామిలీలో ఆస్తుల మంటలు?

- మోహన్‌బాబు, మనోజ్ ఘర్షణ?
- గాయాలతో దవాఖానలో చేరిన మనోజ్
- పోలీసులకు తండ్రీకొడుకుల పరస్పర ఫిర్యాదు
- అంతర్గతంగా చర్చించుకుంటామని తర్వాత వెల్లడి
- ఆస్తుల వివాదంలో